సాక్షి రంగారెడ్డి

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



సస్యరక్షణతో అధిక దిగుబడి

ఉమ్మడి జిల్లాలో మామిడి పంట దాదాపుగా 13,500 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. 10లో▸



కల్యాణోత్సవం

మక్తమాధారంలో వేణుగోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. 10లో▸



ప్రజావ్యతిరేక పాలన

బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఉద్యోగ భద్రత కల్పించండి

రెండవ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు

ఇబ్రహీంపట్నం రూరల్: రెండవ ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ, సువర్ణ మాట్లాడుతూ.. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి రెండవ ఏఎన్‌ఎంలను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి యాదయ్య, జయమ్మ, సుజాత, స్వర్ణలత, రజిని, లిల్లి, జమిళ్ళ, పార్వతి, విజయలక్ష్మి, రజిని, ఇందు తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ తల్లి ఆలయాభివృద్ధికి కృషి

స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



అమ్మవారి పూజలో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: మైసిగండి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయార్చకులు తీర్థప్రసాదాలు అందజేసి పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి నాయకులు శ్రీను నాయక్, గురువయ్య, అశోక్, అంజి, సుమన్ నాయక్, రాహుల్, అంజియాదవ్, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన మహిళలకు అవార్డులు

- 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాంఘిక, ఆర్థిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరించి అవార్డులు ప్రదానం చేస్తామని జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. జిల్లాలో అర్హులైన మహిళలు వివిధ రంగాల్లో వారు సాధించిన కనబర్చిన ప్రతిభకు సంబంధించిన అధారాలతో కమిషనర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖలో కార్యాలయంలో ఈ నెల 20న సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని కోరారు.

ప్రజల అభ్యున్నతికి సహకరించండి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ



మంచాల సీఐ బాబ్యనాయక్‌ను సన్మానిస్తున్న జయమ్మ

మంచాల: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని మాజీ ఎంపీపీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ అన్నారు. బదిలీపై మంచాలానికి వచ్చిన ఎంపీడీ బాలశంకర్, సీఐ బాబ్యనాయక్‌ను ఆమె శుక్రవారం సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం జయమ్మ మాట్లాడుతూ.. మండలం గ్రామీణ, గిరిజన తండాల మిళితమని.. వారికి అందాల్సిన సదుపాయాలను కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ మల్లేశ్, పార్టీ నాయకులు శ్రీధర్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

వైభవంగా రథసప్తమి

సూర్యుడి పుట్టిన రోజున నిర్వహించే రథ సప్తమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే భక్తులకు దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరసింది. చేవెళ్ల మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని ఏడు వాహనాలపై ఏడు అవతారాల్లో ఊరేగించారు.

– సాక్షి, నెట్‌వర్క్

చెరువులు

చెరువులు, కుంటలు నివాస స్థావరాలుగా మారుతున్నాయి. అధికారుల అలసత్వం కబ్జాదారులకు వరమైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో సులువుగా ఎన్‌ఓసీలు, ఎల్‌పీ నంబర్లు కేటాయించడంతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. జలవనరుల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు.

రికార్డుల్లో ఉన్నా కనిపించని ఆనవాళ్లు

- శిఖం భూముల్లో వెలుస్తున్న వెంచర్లు
- అడ్డగోలుగా ఎన్‌ఓసీలు, ఎల్పీనంబర్లు
- అడ్వకేట్ కమిషన్ ఏర్పాటుతో కదలనున్న డొంక
- ఇప్పటికే శేరిలింగంపల్లిలో పలు చెరువుల పరిశీలన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చెరువుల పరిరక్షణలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కళ్ల ఎదుటే తటాకాలు కబ్జా అవుతున్నా పట్టించుకోవడం లేదు. ఆక్రమణ దారులు, రియల్టర్లు అడిగిందే తడవుగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ తదితర అంశాలు పరిశీలించకుండానే ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీలు, హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్‌పీ నంబర్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో విలువైన చెరువులు, కుంటలు ఉనికిని కోల్పోతున్నాయి. జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలుండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు ఓఆర్ఆర్‌కు అటు, ఇటుగా విస్తరించి ఉండటం, ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కళ్లు ఈ చెరువులపై పడ్డాయి.

ఆనవాళ్లు కోల్పోయిన చెరువులు

- మీర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 148లోని 59.30 ఎకరాల విస్తీర్ణంలోని మంత్రాల చెరువు ప్రస్తుతం 33 ఎకరాలకు కుచించుకుపోయింది. సర్వే నంబర్ 131లో 35 ఎకరాల విస్తీర్ణంలోని తాళ్లచెరువు పూర్తిగా కనుమరుగైంది.
- జిల్లెలగూడ సర్వే నంబర్ 155, 179, 198, 101, 102లోని 30 ఎకరాల విస్తీర్ణంలోని వెలిసిన సంజచెరువు ప్రస్తుతం 12 ఎకరాలే మిగిలింది. సర్వే నంబర్ 61లో 70 ఎకరాల్లో వెలసిన పెద్ద చెరువులో ఇప్పటికే 42 ఎకరాలకుపైగా ఆక్రమణ దారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.
- బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 184లోని 39 ఎకరాల్లో విస్తరించి ఉన్న గుర్రం చెరువులో ఇప్పటికే 24 ఎకరాలు ఆక్రమణకు గురైంది. సర్వే నంబర్ 127, 128,/1, 128/2లోని 16.16 ఎకరాల (ఎఫ్‌టీఎల్ పరిధిలో 33.20 ఎకరాలు) పెద్ద చెరువులో ఇప్పటికే 15 ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.
- సర్వే నంబర్ 188, 189, 190లోని 37.34 ఎకరాల్లో విస్తరించిన బురాన్‌ఖాన్ చెరువు (వెంకటాపూర్) ప్రస్తుతం ఏడు ఎకరాలే మిగిలింది. సర్వే నంబర్ 160, 169, 161లోని 40.9 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎర్రకుంటలో 32 ఎకరాలు మాయమైంది. మల్లాపూర్ రెవెన్యూ వెంకటాపూర్ సర్వే నంబర్ 273లో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన సుద్దమోనికుంట సగానికిపైగా కబ్జాపాలైంది.
- బడంగ్‌పేట్‌లోని సర్వే నంబర్ 145లో 14.15 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన కుల్లోనికుంట ప్రస్తుతం పది ఎకరాలే మిగిలింది. ఇదే మున్సిపాలిటీ పరిధిలోని కొత్తకుంట ఆనవాళ్లు లేకుండా పోయింది. కనీసం రికార్డులు కూడా లేవు.
- ఇక 267 ఎకరాల విస్తీర్ణంలోని జల్‌పల్లి చెరువులో ఇప్పటికే వంద ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట కింది భాగం సర్వే నంబర్ 223లోని నాలుగు ఎకరాలకుపైగా భూమి పేదల పేరుతో కబ్జా చేశారు.
- గాలిదొడ్డి సర్వే నంబర్ 71లోని 5.30 ఎకరాల ఈద్గవానికుంట పూర్తిగా కనుమరుగైంది. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు సరిహద్దు గ్రామంలో 6.23 ఎకరాల్లో విస్తరించిన హత్తిగూడ కుంట ఆనవాళ్లు లేకుండా పోయింది.
- కాటేదాన్‌లోని సర్వే నం. 247లో 19.15 ఎకరాల మామిడికుంట(ఐదు ఎకరాలు) ఆక్రమణకు గురైంది. ఇదే ప్రాంతంలోని కీలకమైన అప్పాచెరువు 39 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ప్రస్తుతం 12 ఎకరాలు మిగిలింది. బాబుల్‌రెడ్డి నగర్‌లోని 22 ఎకరాల నర్సబాయికుంటను పూర్తిగా మింగేశారు.
- తుర్కయాంజాల్ మాసబ్ చెరువు శిఖం భూముల్లో ఇప్పటికే వెంచర్లు వెలిశాయి. ఏకధాటి వర్షాలకు వరదనీరు భారీగా చెరువులోకి చేరడంతో ఆ భూములన్నీ నీటమునిగాయి. రియల్టర్లు భారీ బండరాళ్లు, లారీల కొద్ది మట్టి పోసి చెరువు ఆనవాళ్లు లేకుండా చేశారు. స్థానికులు నెలల తరబడి ఆందోళనలు చేపట్టినా.. పోసిన మట్టిలో పిడికెడు కూడా బయటికి ఎత్తిపోయలేదు.

రంగంలోకి అడ్వకేట్ కమిషన్

చెరువులకు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) నిర్ధారణపై నిలువెల్లా నిర్లక్ష్యం కొనసాగుతోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 28 చెరువులు ఉండగా, వీటిలో 18 చెరువులకు, రంగారెడ్డిజిల్లాలో 1,078 చెరువులు ఉండగా, వీటిలో 79 చెరువులకు, మేడ్చల్ జిల్లాలో 620 చెరువులు ఉండగా, వీటిలో 97 చెరువులకు మాత్రమే ఎఫ్‌టీఎల్ నిర్ధారించారు. మిగిలిన వాటికి ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయడంలో ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇటీవల హైకోర్టు సీరియస్ అయింది. ఆయా చెరువుల పరిరక్షణ కోసం అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లోని దుర్గం చెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, గాలిదొడ్డిలోని గోసాయికుంట, నల్లగండ్లలోని పెద్ద చెరువు సహా గంగారం పెద్ద చెరువు, సరూర్‌నగర్ మండలం బైరమల్‌గూడ రెవెన్యూ పరిధిలోని మద్దెలకుంటలను జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి అడ్వకేట్ కమిషన్ పరిశీలించింది.

సాయిబాబా సేవలో గవర్నర్

బడంగ్‌పేట్: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ప్రశాంతి హిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠాన్ని శుక్రవారం గవర్నర్ తమిళిసై సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠం నిర్వాహకులు సాయిక్ర్పాకర యోగి గోపాల కృష్ణానంద స్వామీజీ రచించిన ఆదిత్యహృదయం పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి జానకి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బాబా ఆలయంలో గవర్నర్ తమిళిసై

జనవాడను మోహరించిన పోలీసులు

- పీఎస్ ముట్టడికి పిలుపునిచ్చిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్
- భద్రత మరింత కట్టుదిట్టం

శంకర్‌పల్లి: జనవాడ గ్రామాన్ని పోలీసులు చుట్టుముట్టారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం సీసీ రోడ్డు వేస్తుండగా తలెత్తిన వివాదంలో పరస్పరం దాడులు చేసుకున్న విషయం విదితమే. 144 సెక్షన్ విధించడంతో గ్రామంలో వ్యక్తులను గుంపులుగా ఉండకుండా.. కొత్త వ్యక్తులను గ్రామంలోకి అనుమతించకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఓ వర్గానికి చెందిన 30 మందిపై కేసు నమోదు చేయగా..మరో వర్గానికి చెందిన 26 మందిపై కేసులు పెట్టినట్లు సమాచారం. గురువారం 11మందిని రిమాండ్‌కు తరలించగా.. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తమవర్గంపై అక్రమంగా కేసులు బనాయించారని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు శుక్రవారం మోకిల పీఎస్ ముట్టడికి పిలుపునిచ్చారనే సమాచారం అందింది. దీంతో భద్రతను కట్టు దిట్టం చేశారు. కాగా శుక్రవారం జనవాడను రాజేంద్రనగర్ అదనపు డీసీపీ విజయ్‌కుమార్ సందర్శించారు.

అదృష్టం వరించింది.. అవిశ్వాసం వీగింది

పంతం నెగ్గించుకున్న 'పట్నం' చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: నలభై రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 24 మంది సభ్యులున్న మున్సిపాలిటీలో 15మంది బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించి కలెక్టర్‌కు నోటీసులిచ్చారు. శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఒక్కరు కూడా హాజరవ్వక పోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు.

గులాబీ నుంచి కాంగ్రెస్ శిబిరంలోకి..

స్రవంతి మామ కప్పరి లక్ష్మయ్య మాజీ సర్పంచ్. ఆమె రాజకీయాలకు కొత్తయినా తొలిసారిగా జనరల్ మహిళ స్థానం నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది జనరల్ ఎస్సీ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుంది. రెండేళ్లుగా కౌన్సిలర్లు ఆమెపై తిరుగుబాటు చేస్తున్నారు. ఆమెను పదవి నుంచి దించే అవకాశం వచ్చినా బీఆర్ఎస్ నేతలు చేజార్చుకున్నారు. అవిశ్వాసం పెట్టిన ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ శిబిరంలో చేరడంతో అవిశ్వాసానికి బలం లేకుండా పోయింది. దీనికి తోడుగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నమోదవ్వడంతో ఆమెకు మరింత బలం చేకూరింది. సమావేశానికి వెళ్లినా నెగ్గలేమని బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

భారీ బందోబస్తు

అవిశ్వాస సమావేశం ఉన్నందున అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ దారులన్నింటికీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సమావేశం అనంతరం ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ శ్రేణులు బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.



క్యాంపు శిబిరంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్ల ఆనందోత్సాహం

హస్త విలాసం!

కాంగ్రెస్‌లోకి వలసల జాతర

- తాజాగా మాజీ మేయర్ బొంతు దంపతులు
- వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత కంచర్ల సైతం
- త్వరలో మరికొందరు చేరే అవకాశం
- లోక్‌సభ ఎన్నికల నాటికి పెరగనున్న బలం?

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోకి వచ్చే జిల్లాల నుంచి పలువురు నేతలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో ఆ పార్టీలో జోష్ పెరుగుతోంది. రాబోయే రోజుల్లో మరికొందరు చేరే అవకాశాలున్నాయి. తమంత తాముగా వచ్చి చేరుతున్న వారితో పాటు వీలైనంత మందిని పార్టీలో చేర్చుకునేందుకు సైతం కాంగ్రెస్ వల వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు కొందరికి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. తాజాగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన భార్య చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత, బీఆర్‌ఎస్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ హస్తం పంచన చేరారు. త్వరలోనే మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఆమె భర్త బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేత శోభన్‌రెడ్డి చేరడం ఖాయమైంది. ఈ పేర్లు ఇప్పటికే తెరపైకి రాగా, తెర వెనుక ఉన్న మరికొందరు త్వరలో ముందుకు రానున్నారు.

రాజధానిపై పట్టు కోసం..

రచ్చ గెలిచినా ఇంట ఓడినట్లు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికస్థానాలు సాధించి అధికారంలోకి వచ్చినప్పటికీ, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కచోట కూడా గెలవలేదు. దీంతో రాజధాని నగరమైన హైదరాబాద్‌లో, జీహెచ్‌ఎంసీ పరిధిలో అది పార్టీకి తీరని వెలితిగా ఉంది. మేయర్ స్థానం సైతం బీఆర్‌ఎస్ పార్టీకే ఉంది. రాజధాని నగరంలో ఏ అభివృద్ధి చేపట్టినా, ప్రారంభోత్సవాలు చేసినా ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానిస్తే బీఆర్‌ఎస్ నేతలే కనిపిస్తున్నారు. ఈ పరిస్థితి నివారణతో పాటు త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలంటే ఎక్కువ మంది తమ పార్టీ నేతలుండాలని కాంగ్రెస్ కృత నిశ్చయంతో ఉంది. అందుకే వీలైనంత మంది ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లను తమవైపు రప్పించే పనిలో పడింది. వందమంది ఓటర్లను మళ్లించగలిగే నేతల్ని సైతం పార్టీలోకి తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కార్పొరేటర్లపై కన్ను..

కలిసి వచ్చే కార్పొరేటర్లనూ ఇతర పార్టీల వారిని భారీగా ఆకర్షించే పనిలో పడింది. అందుకు ఇద్దరు ముగ్గురు నేతలకు ఆ పని అప్పగించినట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో పాటు జీహెచ్‌ఎంసీ పాలక మండలిలోనూ మిగతా పార్టీల కంటే కాంగ్రెస్ బలహీనంగా ఉంది. పాలకమండలి ఎన్నికల సమయంలో తొలుత గెలిచింది కేవలం రెండు స్థానాలే అయినా ప్రస్తుతం బలాన్ని డజన్ స్థానాలకు పెంచుకోగలిగినప్పటికీ అధికార పార్టీకి ఆ బలం చాలదని భావిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలు జీహెచ్‌ఎంసీలో సవ్యంగా అమలు కావాలన్నా, జీహెచ్‌ఎంసీలో తమ పట్టు, ప్రభావం ఉండాలన్నా పాలకమండలిలో తమవారు ఎక్కువగా ఉండాలని భావిస్తోంది. అందుకుగాను బీఆర్‌ఎస్ కంటే ఎక్కువమంది తమకు ఉండాలని భావిస్తోంది. బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం యాభై మందికి పైగా ఉన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్న కాంగ్రెస్.. ఏమేరకు సాధించగలదో ఎన్నికల నాటికి వెల్లడి కానుంది.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

ఎలాగైనా గెలవాల్సిందే..

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్‌లో కలిసి ఉన్న సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఉంది కాంగ్రెస్ పార్టీ. లేని పక్షంలో కేవలం అడ్డగోలు హామీలిచ్చి గెలిచిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని చాటేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కాచుకు కూర్చున్నాయి. అందుకే రాబోయే లోక్‌సభ ఎన్నికల్ని సవాల్‌గా తీసుకున్న కాంగ్రెస్ అన్ని రకాల అస్త్రశస్త్రాలను వినియోగించనుంది. ఎక్కువమంది నేతలను పార్టీలోకి లాగనుందని పార్టీ నేతలు ప్రైవేటు సంభాషణల్లో చెబుతున్నారు. కేవలం బీఆర్‌ఎస్ నుంచే కాకుండా బీజేపీ నుంచి సైతం కాంగ్రెస్ వైపు లాగే యోచనలో ఉంది. దీంతోపాటు నగరంలో ప్రభావం చూపించగల ఎంఐఎంతోనూ చెలిమి దిశగా అడుగులు వేస్తోంది. లోక్‌సభలోనూ గెలుపు జెండా ఎగరేసేందుకు పరిస్థితులను అన్ని విధాలుగా తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాల్లో ఉంది. దీంతో, లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీలోకి భారీగా వలసలు ఉంటాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


వేడుకకు హాజరైన పాల్గొన్న భక్తులు


స్వామివారి కల్యాణ వేడుకలో వేద పండితులు

భక్తుల కోలాహలంతోమక్తమాధారం వేణుగోపాలస్వామి మహోత్సవం

కద్తాల్: మండలంలోని మక్తమాధారం గ్రామంలో కొలువైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తుల జయజయ ధ్వనుల మధ్య శుక్రవారం వైభవంగా సాగింది. కల్యాణోత్సవం కోసం ఏర్పాటు చేసిన మండప వేదిక, చలువ పందిళ్లు, పచ్చటి మామిడి, అరటి, కొబ్బరి తోరణాలతో, తమల పత్ర పుష్పాలు చూడముచ్చటగా అలంకరించారు. పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వింజమూరు రామానుజన్ చార్యులు, ఆదిత్యాచార్యుల బృందం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీ రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి వారి కల్యాణ వేడుకను రమణీయంగా నిర్వహించారు. కల్యాణ వేడుక సందర్భంగా ఆలయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా మంచినీటి వసతితో పాటు, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, విద్యుత్‌శాఖ ఏడీఏ శ్రీనివాస్, ఏఈలు నరేందర్, సీతారాం, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, ఎంపీటీసీ మంజుల, మాజీ మార్కెట్ డైరెక్టర్ నర్సింహ, నాయకులు బాల్‌రాజ్ ముదిరాజ్, కృష్ణ, చెన్నయ్య, గురుమూర్తి, రమేశ్, నారాయణ, చంద్రయ్య, రామకృష్ణ, మాణిక్యం, వినోద్, సుభాష్ వేదపండితులు రంగరాజన్, ముకుందన్, అనిరుధన్, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సడెన్ బ్రేక్‌తో వాహనాల ఢీ

ఐదు కార్ల వెనుక భాగాలు ధ్వంసం

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనం సడెన్‌గా బ్రేక్ వేయటంతో వెనుకనున్న ఐదు వాహనాలు ఒకదాని ఒకటి ఢీకొన్నాయి. ఈ సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలోని ముడిమ్యాల బస్టాప్ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చేవెళ్ల వైపు వస్తున్న వాహనాలకు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ఓ కారు బస్టాప్ రావటంతో స్పీడ్‌ను తగ్గించింది. వెనకాల ఉన్న మరో కారు సడన్‌గా వేగాన్ని తగ్గించడంలో నియంత్రణ తప్పి ముందు కారును ఢీకొట్టింది. అదే క్రమంలో వరుసగా ఐదు కార్లు ఢీకొన్నాయి. దీంతో వాటి వెనక భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అందరూ దిగి చూసుకొనే సరికి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలను పక్కకు తీసి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.


సడెన్ బ్రేక్ వేయడంతో ఢీకొన్న కార్లు

సస్యరక్షణతో అధిక దిగుబడి

- మామిడిలో యాజమాన్య పద్ధతులు ముఖ్యం
- రైతులకు పలు సూచనలు చేస్తున్న క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ




పూతతో ఉన్న మామిడి పంట


తామర పురుగు ఆశించిన కాయ

కందుకూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మామిడి పంట దాదాపుగా 13,500 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి పూత, పిందె దశలోకి వచ్చింది. కాపు నిలబడి మంచి దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

తేనె మంచు పురుగు

తల్లి పురుగులు, పిల్ల పురుగులు చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పూలు, పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీంతో అవి వాడి రాలిపోతుంది. అంతేకాకుండా ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసి కారణమైన శిలీంద్రాలు పెరుగుతాయి. దీంతో ఆకులు, పూత, కాయలపై నల్లని మసి రంగు ఏర్పడుతుంది. జనవరి నుంచి మార్చి వరకు ఇవి లేత ఆకులపై, పూరెమ్మలపై నాలుగు నుంచి ఐదు జీవిత చక్రాలు పూర్తి చేసుకుంటాయి. ఈ పురుగులు కాయలేని సమయంలో చెట్ల కాండం, కొమ్మల బెరడులోని పగుళ్లలో దాక్కొని ఉంటాయి. తోటల్లో కలుపు ఎక్కువగాను, వాతావరణం మబ్బుగా ఉండి గాలిలో తేమ శాతం ఎక్కువ ఉన్న సందర్భాల్లో, ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. రసాన్ని పీల్చడంతో పూత పూర్తిగా మాడిపోయి పిందెపట్టదు.

నివారణ:

- లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ పూత, పిందెలు తయారయ్యే సమయంలో పిచికారీ చేయాలి.
- పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయడంతో పుప్పొడి రాలి పరాగ సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశిస్తాయి.
- మొగ్గదశలో కనిపిస్తే ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- థయోమిథాక్సమ్ 0.3 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పూత, కాపు సమయంలో తేనె మంచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.

తామర పురుగు

తామర పురుగులు రెండు మి.మీ. పొడవు ఉండి, కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చివేస్తాయి. దీంతో చిగురు, ఆకులు చిన్నవిగా ఉండి ఆ తర్వాత రాలిపోతాయి. ఈ తామర పురుగులు పుష్పగుచ్ఛాలపై, పిందెలపై చర్మం గీకి రసం పీల్చడంతో వక్క రంగులో చర్మం బీటలు వారి 'రాతిమంగు' ఏర్పడి, కాయ నాణ్యత పడిపోతుంది.

నివారణ:

- తామర పురుగులు అధికంగా ఉన్నప్పుడు ఫిప్రోలినల్ 1.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుజల్లెడ గూడు పురుగు

ఈ పురుగులు ఆకుల మధ్య ఉన్న కణజాలాన్ని పూర్తిగా తినేసి ఆకుల్ని జల్లెడలాగా చేసి, ఆ తర్వాత ఆకుల్ని దగ్గరకు చేర్చి గూడును ఏర్పర్చుకుంటుంది. ఈ పురుగు పూత దశలో పూలను, పూమొగ్గల్ని ఆశించి తర్వాత పూగుత్తులని గూడుగా ఏర్పరుస్తుంది.

నివారణ:

- పురుగు గూళ్లను వెదురు కర్రతో ముందుగా దులిపి తదుపరి క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి జులై, ఆగష్టు నెలల్లో పిచికారీ చేయాలి.

పండు ఈగ

కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఉధృతి ఎక్కువ ఉంటుంది. లార్వాలు కాయలోని మెత్తని కండను తినడంతో కాయ మెత్తబడి కుళ్లి రాలిపోతాయి.

నివారణ:

- కాయ కోతకు ఒక నెల రోజుల ముందు కాగితంతో తయారు చేసిన సంచులను కాయలకు తొడిగితే, ఈ పండు ఈగ ఆశించకుండా నివారించవచ్చు.
- భూమిలో 50–100 గ్రా. మిథైల్ పెరాథియాన్ పొడిని పాదుల్లో వేసినట్లయితే కోశస్థ దశలో నాశనం చేయవచ్చు.

బూడిద తెగులు

ఈ తెగులు ఆకుల మీద, పూరెమ్మల మీద ఆశించినప్పుడు బూడిదలాంటి తెల్లటి పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. ఇది పూత కాలంలో కనబడుతుంది. చల్లని రాత్రులు వేడి, పగటి వాతావరణంలో పూత, పిందెపై తెల్లని పొడి లాంటి బూజు ఏర్పడుతుంది. ఈ శిలీంద్రం ఆశించితే పూత, పిందెలు రాలిపోతాయి.

నివారణ:

నీటిలో కరిగే గంధకం 3 గ్రా లేక కెరాథేన్ 1 మి.లీ. లేక మైకోబ్యూటనిల్ 1 గ్రా. లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ ఏదైనా ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తర్వాత మందును మార్చి పిచికారీ చేయాలి.

మచ్చ తెగులు

మచ్చ తెగులు ఆశించినప్పుడు గోధుమ రంగు మచ్చలు ఆకులు, పండ్లు, పూలరెమ్మల మీద ప్రస్ఫుటంగా కనబడతాయి. తెగులు ఉధృతంగా ఉంటే పూరెమ్మలు, పిందెలు రాలిపోయి, పూగుచ్ఛమంతా మగ్గిపోతుంది, కాపు ఉండదు.

నివారణ:

ఎండు కొమ్మలను తీసివేసి లీటరు నీటికి 3 గ్రా. కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. లీటరు నీటికి 1 గ్రా. కార్బండైజిమ్ కలిపి పూత, పిందె సమయంలో 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ఇలా మేలైన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

కేంద్రానిది ప్రజావ్యతిరేక పాలన

- ఆర్థిక, మతోన్మాద, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- యాచారంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారత్ బంద్


భారత్ బంద్‌లో భాగంగా యాచారంలో కార్మికుల ర్యాలీ

యాచారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌బంద్‌లో ఆయన పాల్గొని యాచారం మండల కేంద్రంలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్థిక మతోన్మాద కార్మిక ఉపాధి వ్యతిరేక చట్టాలను తెచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించిన 49 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ చట్టాలు చేసి రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 11 నెలలు నిరసన చేపట్టి 600మంది కార్మికులు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుంచి నేటి వరకు కార్మికులకు అండగా ఎర్రజెండా మాత్రమే పోరాడుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ మూడోమారు అధికారంలోకి వస్తే కార్మికులకు జీవనోపాధి ఉండదని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ చౌరాస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మాల్, ధర్మన్నగూడెం, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లోనూ బంద్ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.బ్రహ్మయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, నాయకులు తావునాయక్, మల్లేశ్, పెద్దయ్య, ఐలయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పోకడలతో ప్రమాదం


పట్టణ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసిన కార్మిక సంఘాలు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలను వెంటనే మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ట్రేడ్ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ ముఖ్య కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన భూపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. దీంతో నిరుపేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం అవుతుందన్నారు. వలసలను నివారించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. కార్మిక చట్టాలను బలహీనం చేసే నాలుగు రకాల లేబర్ కోడ్‌లను తయారు చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తేవడం ఆందోళనమన్నారు. ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేకతను రాజకీయంగా ఎదుర్కొనలేక హిందుత్వ రాజకీయాలను చేస్తూ ఓటు బ్యాంకును పెంచుకొని తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర రాకపోవడంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఢిల్లీలో రైతులు ఆందోళనలు చేస్తుంటే సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించి చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పంటల మద్దతు ధర విషయమై ప్రభుత్వం వెంటనే స్వామినాథన్ కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్, శ్రీనునాయక్, ఈశ్వర్, లలిత, వెంకటప్ప, వెంకటయ్య, జంగయ్య, రాజు, శ్రీను, మల్లేష్, దశరథ్, వెంకటేశ్, జంగయ్య, చంద్రయ్య, సరిత, సత్తెమ్మ, కృష్ణ, సిద్దమ్మ, రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఓఈ సెట్ ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్: గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో చేరేందుకు కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) సెట్ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో 312 మంది విద్యార్థినులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

మాడ్గుల: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడగా గీత కార్మికుడికి గాయలైన సంఘటన మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామనికి చెందిన మాదాసు యాదయ్య గౌడ్ రోజువారి పనిలో భాగంగా తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే ఆయనని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిల్కమర్రి శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతురాజు లలిత(52) కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లింది. హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్న తర్వాత కోమాలో నుంచి బయటపడింది. కానీ మతి స్థిమితం సక్రమంగా లేకపోవడంతో లలిత బయటకువెళ్లి కొన్ని రోజుల తరువాత ఇంటికి చేరుకునేది. ఈ క్రమంలో ఆమె గురువారం అర్ధరాత్రి గ్రామ శివారులో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. బాలానగర్ స్టేషన్ మాస్టర్ విజయకుమార్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తులను పిలిపించి మృతురాలు లలితగా గుర్తించారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడు సైతం..

షాద్‌నగర్‌రూరల్: తాగుడుకు బానిసైన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బూర్గుగడ్డ తండాకు చెందిన ముడావత్ నరేష్(22) మద్యానికి బానిసైయ్యాడు. ఈ విషయమై అతడు రోజు భార్యతో గొడవ పడేవాడు. దీంతో మనస్తాపం చెందిన నరేష్ బూర్గుల గ్రామశివారులో గుర్తు తెలియని రైతు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలానగర్ స్టేషన్ మాస్టర్ విజయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.